క్లుప్తంగా

రేపు అనఘాష్టమి వ్రతం

హన్మకొండ కల్చరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగురోడ్డులోని వరద దత్త క్షేత్రంలో శనివారం ఉదయం 10గంటలకు వేయిమంది భక్తులతో సామూహిక అనఘాష్టమి వ్రతం నిర్వహించనున్నట్లు దత్త క్షేత్ర ట్రస్ట్ సభ్యుడు వైవీ.వామన్‌రావు తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు సూక్త యాగం, సాయంత్రం 6గంటలకు ధనలక్ష్మీ పూజ జరుగుతుందని పేర్కొన్నారు. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు 93901 02111, 92468 92234 నంబర్లలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థస్వామిజీ శుక్రవారం వరంగల్ దత్తపీఠం చేరుకుంటారని వివరించారు. సాయంత్రం 6గంటలకు స్వాగతసభ ఉంటుందని అన్నారు.

వ్యాధి కొలమానాలను లీగల్ మెట్రాలజీ పరిధిలోకి తేవాలి



నయీంనగర్: వ్యాధి కొలమానాలను లీగల్ మెట్రాలజీ పరిధిలోకి తేవాలని వినియోగదారుల సంఘాల జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, చదలవాడ హరిబాబు, శంకర్‌లాల్ చౌరాసియా కోరారు. ఈమేరకు హైదరాబాద్ లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ సిద్ధార్థ్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. జ్వరం, బీపీ, షుగర్, కరోనా వ్యాధి నిర్ధారణ కొరకు ఇటీవల వేగంగా ఉపయోగంలోకి వచ్చిన కొలమానాలు వాటర్ మీటర్లు, వాహనాల స్పీడ్ గన్స్, తేమ నిర్ధారణ మిషన్లను తూనికలు కొలతలు లీగల్ మెట్రాలజీ పరిధిలోకి తేవాలని పేర్కొన్నారు. జైలుశిక్ష లేకుండా భారీ జరిమానా విధించే సవరణలపై వినియోగదారుల సంఘాలు, వ్యాపార ప్రతినిధుల అభిప్రాయాలు సేకరణకు లీగల్ మెట్రాలజీ సత్వరమే జిల్లా, రాష్ట్ర స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని కోరారు. అన్ని రాష్ట్రాల్లో అభిప్రాయ సేకరణ పూర్తి కావస్తున్నా తెలంగాణలో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదని అన్నారు. దానికి ఈనెల 22 తుది గడువు అని గుర్తుచేశారు.

సాంకేతిక అభివృద్ధి సాధించాలి



మామునూరు: విద్యార్థులు చదువుతోపాటు కృత్రిమ మేధస్సుతో కూడిన సాంకేతిక అభివృద్ధిని సాధించే దిశగా పరిశోధనలు చేయాలని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, కాయిన్ కన్సల్‌టెన్సీ సీఈఓ దుర్గాన వీన్ సూచించారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ (సీఎస్‌ఈ, ఏఐఎంఎల్) ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై జాతీయ స్థాయి శిక్షణ తరగతులు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రోగ్రామింగ్ స్కిల్స్, కృత్రిమ మేధస్సుతో కూడిన సాంకేతిక అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు మానవ అభివృద్ధికి ఉపయోగపడేలా సాంకేతిక పరిశోధనలు జరగాలని, అందుకు పారిశ్రామిక అనుసంధాన ప్రాజెక్టులు చేయాలని చెప్పారు. సాంకేతిక పరిశోధన రంగంలో అభివృద్ధి కోసం వివిధ ఎస్‌ఐటీలు, ఐఐటీలతో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డాక్టర్ తన్వీర్ జహాన్, సలీమ్, శ్వేత, రంజిత్, తిరుపతిరావు, ఎస్ఎస్‌వీఎన్‌శర్మ, రాజు పాల్గొన్నారు.

ఐఐఎం శైలిలో ఎంబీఏ కోర్సు చదవాలి



హన్మకొండ అర్బన్: విద్యార్థులు ఎంబీఏ కోర్సును ఐఐఎం శైలిలో చదవాలని కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ రిటైర్డ్ డీన్ ప్రొఫెసర్ కృష్ణమాచారి సూచించారు. హంటర్‌రోడ్డులోని న్యూసైన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో కళాశాల డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని, వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్.రాజేశం, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో గ్యాంగ్‌వర్క్

కాజీపేట: పట్టణంలోని 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని హిందూ శ్మశానవాటికలో ప్రత్యేక గ్యాంగ్ వర్క్ పనులను కార్పొరేటర్ విజయశ్రీరజాలీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, వ్యర్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. కాగా, దీపావళి పర్వదినాన ప్రజలు సమాధుల పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

జోరుగా నామినేషన్ల పర్వం

నామినేషన్ల దాఖలుకు తుది గడువు సమీపించడంతో పలు పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. నగర వ్యాప్తంగా వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల నుంచి పలు పార్టీల అభ్యర్థులు, ఆశావహులు గురువారం ఆయా ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. శుక్రవారంనామినేషన్ల గడువు ముగియనుంది.

- వరంగల్ / కాజీపేట



బీఎస్పీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ట్రాన్స్‌జెండర్ పుష్పిత లయ



వరంగల్ పశ్చిమ నుంచి నామినేషన్ వేస్తున్న జంగా రాఘవరెడ్డి



కాంగ్రెస్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న కొండా మురళీధర్‌రావు



నామినేషన్ అందజేస్తున్న అరూరి రమేష్



నామినేషన్ అందజేస్తున్న కొండేటి శ్రీధర్



నామినేషన్ దాఖలు చేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి రాజనాల శ్రీహరి



నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి భాను లక్ష్మణ్



ఎఫ్‌బీఐ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న సిద్ధం నరేష్



రాష్ట్ర భారతీయ స్వదేశీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వావిలాల రాజేందర్..



ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బోళ్ల రామకృష్ణ



న్యూ ఇండియా పార్టీ నుంచి నామినేషన్ వేస్తున్న పనికెల శ్రీనివాస్



స్వతంత్ర అభ్యర్థిగా పల్లకొండ మల్లీశ్వరి



ధర్మ సమాజ్ పార్టీ తరఫున నామినేషన్ అందజేస్తున్న కేదల ప్రసాద్

జీవాల్లో పీపీఆర్ నివారణకు టీకాలు

హసన్‌పర్తి: పీపీఆర్‌వ్యాధి నివారణకు హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 4.65లక్షల గొర్రెలు, 65వేల మేకలకు టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటనారాయణ తెలిపారు. హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో పీపీఆర్ టీకా శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి గొర్రెలకు టీకాలు వేశారు. అనంతరం వెంకటనారాయణ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇరువై రోజుల పాటు ఆయా గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పీపీఆర్ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు చెప్పారు. ఈనెల 19వ తేదీ వరకు టీకా కార్యక్రమం కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్చన, ఎల్‌ఎస్ఎ సురేష్, ఎల్ఎస్ఏ నబీ, సిబ్బంది రాహుల్, ఇష్తెకార్ అలీ, గొర్రెలు, మేకల పెంపకందారులు పాల్గొన్నారు.



పొట్టేలుకు టీకా వేస్తున్న వెంకటనారాయణ

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



స్టాళ్ల వద్ద కొనుగోలు చేస్తున్న మహిళలు

హన్మకొండ: అశోక హోటల్‌లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన నగర మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. పలు రాష్ట్రాలకు చెందిన చేనేతకారులు, డిజైనర్ల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రదర్శన ఫ్యాషన్ మగువలను ఆకర్షిస్తోంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకుడు టీవీ రావు మాట్లాడుతూ అన్ని సందర్భాల్లో ధరించే ఉప్పాడ, కలంకారి, మంగళగిరి, ప్రింట్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్లౌజ్‌లు, టాప్స్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈ వస్త్ర ప్రదర్శన ఈనెల 10తో ముగుస్తుందని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు డిమాండ్‌చేశారు. విప్లవ విద్యార్థి అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని అశోక్ సెంటర్‌లో విప్లవ విద్యార్థి అమరుల సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విద్యారంగం పూర్తిగా సంక్షోభంలోనికి నెట్టివేయబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కామన్ విద్యావిధానం అందించటంలో పాలక వర్గాలు విఫలమయ్యాయని విమర్శించారు. శాస్త్రీయ విద్యావిధానం, సమాజంలో సమానత్వం స్థాపన కోసం పోరాడిన విప్లవ విద్యార్థి అమరులు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్, ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, శంకర్ లాంటి వారి స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, జిల్లా నాయకులు వినయ్, ప్రశాంత్‌రాజ్, అరవింద్, శ్రీను, జస్వంత్, సుశీల్, హేమంత్, రాజేష్, రాజు, మీనాక్షి, అనూష, శ్రీవాణి, వాసతి, మమత తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న నర్సింహరావు

కాలుష్య రహిత దీపావళిని జరుపుదాం..



అవగాహన కల్పిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

విద్యారణ్యపురి: కాలుష్య రహిత దీపావళిని జరుపుదామని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి అన్నారు. ఈమేరకు కాలుష్య రహిత దీపావళిపై అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శబ్ద కాలుష్యంతో కూడిన దీపావళి కాకుండా సాంప్రదాయ పద్ధతిలో దీపాలు వెలిగించి ఆరోగ్యవంతమైన దీపావళిని ఉత్సాహంగా జరుపుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలని కోరారు. అసోసియేషన్ కార్యదర్శి అనంత్, బాధ్యులు వేణుగోపాల్, సత్యనారాయణ, సురేందర్, శేఖర్‌గౌడ్, నర్సయ్య, భిక్షపతి, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సుధీర్‌కుమార్, లక్ష్మయ్య, గాంధీ, అలీ, చంద్రమౌళి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన హసన్‌పర్తి మండలం సీతంపేటకు చెందిన బౌతు సతీష్ కుటుంబ సభ్యులకు స్థానిక ఎంపీటీసీ బండారి రజిత - చేరాలు చేయూతనిచ్చారు. ఈమేరకు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించి బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో స్థానికులు జీ.రాజయ్య, రాజిరెడ్డి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉద్యమాలతోపాటు సేవా కార్యక్రమాలు



కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలపై ఉద్యమాలతోపాటు సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ తెలిపారు. ఏబీఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని కాకతీయ యూనివర్సిటీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏబీఎస్ఎఫ్ పోరాటాల ఫలితంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లు కొనసాగుతున్నాయని గుర్తుచేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, ఇన్‌చార్జ్ దార సురేష్, నాయకులు వంశీ, అనిల్, కిరణ్, సాయి, చంటి, వెంకటేష్, సూర్య, భరత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ అధ్యాపకులను ఆదుకోవాలి

కేయూ క్యాంపస్: ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రైవేట్ కళాశాలల్లోని అధ్యాపకులను ఆదుకోవాలని తెలంగాణ లెక్చరర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. హనుమకొండలో గురువారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు పడిన అనేకం అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో వారిని ఆదుకునే విధంగా హామీలు ఇవ్వాలని లేఖ ద్వారా కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. హెల్త్‌కార్డులు, ప్రభుత్వ గృహ పథకాల్లో ప్రత్యేక కోటా ఇచ్చేవిధంగా చూడాలని కోరారు. ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చౌహాన్, తెలంగాణ లెక్చరర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు సదానందం పాల్గొన్నారు.

రేపు మాదిగల విశ్వరూప మహాసభ

కేయూ క్యాంపస్: ఎస్సీల వర్గీకరణ కోసం ఈనెల 11న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం కాకతీయ యూనివర్సిటీ జనరల్ సెక్రటరీ బొక్క మొగిలి పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ బోర్డు ఆవరణలో మాదిగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజుమాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బొడ్డు దయాకర్ మాదిగ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగం, సంక్షేమం, రాజకీయ రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిమాదిగ, బాధ్యులు సంగాల దయాకర్, మహేందర్, కిరణ్‌కుమార్, సుమన్, ప్రకాశం, కుమ్మరి శ్రీనాథ్, ప్రవీణ్‌కుమార్, జయకర్, భారత్‌కుమార్, బుచ్చయ్య, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు ఘన నివాళి

ఖిలా వరంగల్: అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ శివనగర్‌లోని గోడౌన్ వద్ద సీపీఐ (ఎంఎల్) ప్రజా పంథా వరంగల్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి ఆధ్వర్యంలో అమరులకు గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఎర్ర జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పాలక వర్గ పెట్టుబడిదారుల దోపిడీని విప్లవోద్యమాల ద్వారానే నిర్మూలించవచ్చని వివరించారు. సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కేవలం కమ్యూనిజం ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రజల పక్షాన పోరాటాలు చేస్తున్న విప్లవ కమ్యూనిస్టు పార్టీల నిర్మాణాల్లో ప్రజలు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నరసింహరావు, రాజయ్య, వెంకటయ్య, వెంకటన్న, ల్యాదల్ల ఎల్లయ్య, రాజు, చంటి, వీరన్న, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి



రామన్నపేట: మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

రామన్నపేట: జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధి గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మౌలాలి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను గురువారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మౌలాలి పాఠశాలలో విద్యార్థుల బోధన, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఎన్నికల నోడల్ అధికారి, డీఈ రవికుమార్, హెడ్‌మాస్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

విద్యార్థులదే కీలక పాత్ర

పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఉత్సాహవంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని, ఓటర్లందరూ ఓటు వేసేలా ప్రోత్సహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రావీణ్య సూచించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) వరంగల్ యూనిట్, జిల్లా ఎన్నికల స్వీప్ సమన్వయంతో గురువారం ఏవీవీ కళాశాలలో ఓటరు చైతన్య అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ యువత ఓటింగ్‌లో పాల్గొనడమే కాకుండా వృద్ధులతో పాటు అందరు ఓటు వేసేందుకు సహకరించాలని కోరారు. సహాయక చర్యల్లో పాల్గొనే వారికి గుర్తింపు పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఓటింగ్ నమోదు కావడాన్ని ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. సీబీసీ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ శ్రీధర్ సూరునేని మాట్లాడుతూ గత ఎన్నికల్లో రాష్ట్ర సగటు కంటే తక్కువ ఓటింగ్ శాతం నమోదైన ప్రాంతాల్లో మిషన్ -29 పేరుతో ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఓటు హక్కు వినియోగం గురించి కరపత్రాలు, సంకల్ప పత్రాలను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. స్వీప్ నోడల్ ఆఫీసర్ పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి, డీపీఆర్ఓ ఆయుబ్ అలీ, జిల్లా పరిశ్రమల అధికారి నర్సింహమూర్తి, కళాశాల కార్యదర్శి డాక్టర్ చందా విజయ్‌కుమార్, ప్రిన్సిపల్ భుజేందర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుడిని కలిసిన కలెక్టర్

వరంగల్ జిల్లాకు కేటాయించిన ఎన్నికల సాధారణ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి ఎస్.షణ్ముఖరాజన్ గురువారం నగరానికి చేరుకున్నారు. నిట్‌లో ఆయనను వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించారు. జిల్లా పరిస్థితులను అధికారికి కలెక్టర్ వివరించారు.

ప్రతిభను వెలికితీసేందుకే నృత్య పోటీలు

కాశీబుగ్గ సెంటర్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకే జానపద నృత్య పోటీలు నిర్వహించినట్లు డీఈఓ వాసంతి అన్నారు. వరంగల్ లర్నర్స్ ల్యాండ్ హై స్కూల్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి జానపద నృత్యాల పోటీలు గురువారం ముగిశాయి. ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను డీఈఓ వాసంతి అభినందించారు. జిల్లా అకడమిక్ అధికారి మాలోతు సారయ్య, రవీందర్, శ్రీధర్, లక్ష్మయ్య, ఐఈఆర్‌పీలు స్వామి, ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ చందు, కేజీబీవీ ఎస్ఓలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రపంచానికి దేశం అందించిన అద్భుతం ఆయుర్వేదం



ఆయుర్వేద వాక్‌లో ప్రిన్సిపాల్, వైద్యులు

కాశిబుగ్గ: ప్రపంచానికి భారతదేశం అందించిన అద్భుతం ఆయుర్వేద వైద్యం అని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఆయుర్వేద వాక్ నిర్వహించారు. ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాల నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ జంక్షన్ మీదుగా వెంకట్రామ జంక్షన్ వరకు వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ అల్లోపతి వైద్యంలో నయంకాని వ్యాధులు ఆయుర్వేద వైద్యం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని వివరించారు. అనేక రకాల వైద్య సేవలు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ ఆర్‌డీడీ డాక్టర్ రవినాయక్, ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోనాచారి, ప్రొఫెసర్లు డాక్టర్ రవీందర్‌గౌడ్, డాక్టర్ దుర్గాబాయి, డాక్టర్ శిరీష, డాక్టర్ మహేష్, వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడాలి



చంద్ర పుల్లారెడ్డికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఖిలా వరంగల్: బ్రాహ్మణీయ హిందూ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఒక్కరూ పోరాడాలని మానవ హక్కుల వేదిక వరంగల్ జిల్లా నేత బండి కోటేశ్వర్‌రావు, పాలకుర్తి సత్యనారాయణ, పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థి సంఘ నేత తీగల జీవన్, మైదం సంజీవ్ సూచించారు. చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సందర్భంగా ఖిలా వరంగల్ పడమర కోట అమర వీరుల స్తూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత బాలరాజు ఆధ్వర్యంలో పుల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణను అమలు చేస్తున్న భారతీయ జనతా పార్టీని ఓడించాలని సూచించారు. రాష్ట్రంలో పదేళ్లపాటు కేసీఆర్ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బూటకపు వాగ్దానాలతో మళ్లీ అధికారంలోకి రావడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నేత బన్న నర్సింగం, బండి కుమార్, ఇనుముల కృష్ణ, అక్బర్, రాజేందర్, హరిబాబు, విజయపాల్, ఆకుల కుమారస్వామి, రవి, వేణుమాధవ్ పాల్గొన్నారు.

బాలల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

ఎల్కతుర్తి: బాలల హక్కులను సంరక్షించడం అందరి బాధ్యతని సీడీపీఓ స్వరూప అన్నారు. భీమదేవరపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం బాలల హక్కుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

నరకాసుర వధను జయప్రదం చేయాలి

కరీమాబాద్: వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల (కుడా) మైదానంలో ఈనెల 11న సాయంత్రం నిర్వహించనున్న నరకాసుర వధను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి అన్నారు. వేడుకలు నిర్వహించనున్న ఉర్సుగుట్ట ప్రాంగణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీపావళి పండుగ సందర్భంగా గత 19ఏళ్లుగా నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందకున్నా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయాలకతీతంగా ప్రజలు, దాతల సహకారంతో ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కమిటీ బాధ్యులు కనుకుంట్ల రవి, ఆవునూరి రాంమూర్తి, వనం కుమార్, మరుపల్ల గౌతం, మాటేటి శ్యామ్, వంగరి సురేష్, అన్న కుమారస్వామి, మరుపల్ల శివ, కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మరుపల్ల రవి

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కంపెనీ అధికారులు

నయీంనగర్: ప్రభుత్వరంగ సాధారణ బీమా సంస్థ న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీలో మోటార్ థర్డ్ పార్టీ బీమా చేయించుకొని ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దానం సదానందం కుటుంబ సభ్యులకు రూ.15 లక్షల చెక్కును అందజేశారు. నయీంనగర్ జీఎంఆర్ కాంప్లెక్స్ న్యూ ఇండియా కార్యాలయంలో న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ సీనియర్ డీఎం ఎండీ బషీరుద్దీన్, సిబ్బంది గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బషీరుద్దీన్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు బీమా చేయించుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉంటేనే ఇన్సూరెన్స్ సౌకర్యం అందుతుందని చెప్పారు.